# శంభూదాదా కథ

భీమరాజు వెంకటరమణ

శంభు అంటే ఆ ప్రాంతంలో అందరికీ హడల్. దాదాపు ప్రతీ గొడవలోనూ అతని ప్రమేయం ఉంటుంది. వీధి రౌడీ అనిగానీ, దాదా అనిగానీ ఎవరైనా అంటే లాగి ఒకటిస్తాడు. అందుకే అక్కడివారంతా ఆ విషయం మనసులో ఉంచుకొని అతనితో ఎంతో సౌమ్యంగా, సామరస్యంగా మసులుకుంటూ ఉంటారు.

ఏ గాలి సోకిందోగానీ ఈమధ్య రచయిత కావాలని విపరీతంగా అనిపించటం మొదలుపెట్టి మేధస్సుకి పదును పెట్టి ఒక కథ రాసేసి ఒక వారపత్రికకు కూడా పంపించాడు. ప్రతీవారం అందరికీ తన కథ వస్తుందని చెప్పటం ఆ పత్రిక కొని చూడటం, అది లేకపోవడం, జనాలు అతన్ని ఎగతాళి చేయటానికి ధైర్యం చేయలేకపోయినా ఆ అర్థం వచ్చేట్లు ఒకవిధంగా చూడటం మొదలుపెట్టారు. హుందాగా కాలర్ ఎగరేసుకుని తిరిగేవాడు అనవసరంగా ఈ విషయంలో తలదూర్చి ఏమిటో తెలియని అయోమయంలో పడ్డాడు.

అనుకోకుండా ఒకరోజు పోస్టుమాన్ ఒక కవరు తెచ్చిచ్చాడు. ఆత్రుతగా కవరును ఎడాపెడా చింపి చూసిన శంభుకి తను పంపిన కథే తిరిగి వచ్చి దర్శనమిచ్చింది.

శంభు కోపంతో ఊగిపోయాడు. సముద్రంలో కెరటాలు మరీ ఎత్తు ఎగిరి పడటాలు, తుఫాన్‌లో పెద్ద పెద్ద చెట్లు అటూ ఇటూ ఊగడాలు లాంటి సందర్భం అన్నమాట. పళ్లు పటపట కొరుకుతూ కవరు చేతపట్టుకొని ఆ పత్రిక ఆఫీసు వైపు ఉధృతంగా బయలుదేరాడు.

ఆఫీస్ బాయ్ వారిస్తున్నా వినకుండా తోసుకుంటూ సబ్ ఎడిటర్ గదిలోకి వెళ్లి ఆయన చెప్పకుండానే కుర్చీలో కూర్చొని "ఏమిటిది?" అన్నాడు కవరు టేబుల్ మీద దాదాపు విసిరేస్తూ. ఈయన ఎవరో, ఇదంతా ఏమిటో మొదట అర్థంకాని సబ్ ఎడిటర్ రావ్, ఆ కవరు తీసుకొని దానిలోని కాగితాలు బయటకు తీసి చూసిన క్షణంలోనే "ఈ కథ మీరు రాసిందేనా?" అని అడిగాడు.

"అదే ఎందుకని? ఆ నచ్చకపోవడానికి కారణమేమిటో తెలుసుకుందామనే వచ్చా" అన్నాడు శంభు టేబుల్ మీద చూపుడువేలుతో గుచ్చుతున్నట్లు కొడుతూ.

రావ్‌కి కాస్త కోపం వచ్చింది. కానీ తమాయించుకొని రచయితలను గౌరవించటం తన బాధ్యతగా భావించి వివరణ ఇవ్వడం మొదలుపెట్టాడు. "చూడండి! మాకు ఆమోదయోగ్యం కాని కథలు వాపసు పంపడానికి మేము రచయిత అడ్రసు కల కవరు, స్టాంపు అంటించి పంపమని చెబుతుంటాము. అలాంటిది మీరు కథను మాకు పంపిన కవరుకి స్టాంపులు లేకుండా పంపారు. మేము రెట్టింపు డబ్బు కట్టి తీసుకోవడం ఏమిటి?" అన్నాడు చిరాగ్గా.

శంభు కళ్లు కాస్త పెద్దవి చేసి మట్లాడటం మొదలుపెట్టాడు. "ఇంతింత భవనాలు కట్టుకున్నారు. పత్రికా రంగంలో గొప్ప పేరు సంపాయించారు. వేల కథలు ప్రచురించారు, నాలాంటి వేలల్లో ఒక రచయిత స్టాంపులు అంటించకుండా కవరు పంపిస్తే మీరు ఆమాత్రం పెట్టుకోలేరా? ఆ కారణంగా కథను ప్రచురించటం మానేస్తారా?" నిలదీశాడు.

సబ్ ఎడిటర్‌కి ఆశ్చర్యం కలిగింది. "ఏమిటి ఇతను మాట్లాడే తీరు" అనుకొని తమాయించుకొని "సరే! ఇదేమిటి? కథ సగం వరకు కథానాయిక పేరు సుజి అని రాసి తరువాత సోని అని రాశారు? ఆమె ఎవరు?" అడిగాడు. "ఆమే ఈమె" అన్నాడు శంభు ఆమాత్రం అర్థం కాలేదా అన్నట్లు.

"అదెలా కుదురుతుంది? పేర్లు మారిపోతే ఎలా?" అడిగాడు రావ్. లేచి నిలబడ్డాడు శంభు. "అది కాదండి! టీవీ సీరియల్స్‌లో ప్రతి పది ఎపిసోడ్‌లకి ఒకరు చొప్పున నటుల్ని మారుస్తూ చివరకి వచ్చే సరికి దాదాపు అందరినీ మారుస్తున్నారు. శ్రద్ధగా మనం సీరియల్స్ చూడటం లేదా? మనుషుల్నే మారుస్తున్నప్పుడు తప్పు లేనిది పేర్లు మారిస్తే తప్పేమిటి? రావ్ కళ్లల్లోకి గుచ్చి గుచ్చి చూస్తూ ప్రశ్నించాడు శంభు.

రావ్ గట్టిగా గాలి పీల్చుకొని వదలి మళ్లీ పేపర్లు చూపిస్తూ "హీరో రైలు పట్టాలు పీకి వాటితో ఫైటింగ్ చేసినట్లు రాశారు. రైలు పట్టాలు పీకడం ఏమిటి? అదీ రైలు వచ్చేటప్పుడు?" వింతగా విసుగ్గా మొహం పెట్టి అడిగాడు.

శంభు వ్యంగ్యంగా నవ్వుతూ "సినిమాల్లో పది అంతస్థుల మీద నుండి మన తెలుగు హీరో దూకి పరుగెత్తి పోతాడు, చుట్టూ వందమంది తుపాకులతో కాల్చినా అతనికి ఒక్క బులెట్ కూడా తగలదు. ఈయన కాలిస్తే మాత్రం ఒక్కొక్కసారి ఒక్క బులెట్‌కి ఇద్దరు కూడా పడిపోతారు. మనం నోరు తెరుచుకొని చూడటం లేదా? అలాంటప్పుడు రైలు పట్టాలు పీకడంలో వింత ఏముంది?" అరచెయ్యి మెలిక తిప్పుతూ అడిగాడు.

రావ్ కూడా వాదనలో బాగా లీనమైపోయాడు. "అలాంటప్పుడు అంత సమర్థుడైన హీరోని కాకుండా హీరోయిన్ మరెవరో దారినపోయే దానయ్యను పెళ్లి చేసుకోవడం ఏమిటి?" అడిగాడు.

కస్సుమన్నాడు శంభు. "ఏమండీ! ఏమన్నా అంటే అన్నారంటారుగానీ మన సినిమాల్లో ఎన్నిట్లో హీరో మొదటినుంచీ తనను అమాయకంగా ప్రేమిస్తున్న అమ్మాయిని, అత్త కూతురినో వదిలేసి వేరే అమ్మాయిని పెళ్లి చేసుకోవడం లేదు? హీరోలకి ఒక రూలు హీరోయిన్లకి ఒక రూలూనా? అలా చెయ్యటం నచ్చలేదంటే మీరు స్త్రీ ద్వేషులా?" అని తీక్షణంగా చూస్తూ అడిగాడు.

ఈయనతో ఎలా మాట్లాడాలో అర్థంకాక రావ్ నిస్సహాయంగా శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు. అది చూసి శంభు "మాశారా సార్! మీరు నా కథ వల్ల ఎంత ప్రభావితం అయ్యారో? మనసులో మీకు నచ్చి కూడా అర్థం లేని అనుమానాలతో కథని ప్రచురించడం మానేస్తారా? ఎందుకు సార్ ఆత్మవంచన చేసుకుంటారు?" జాలిగా అడిగాడు.

"ఆత్మవంచన కాదయ్యా! ఆత్మహత్యే చేసుకుంటే ఎలా ఉంటుంది అని ఆలోచిస్తున్నా" అన్నాడు రావ్ కోపం, వ్యంగ్యం కలసిన స్వరంతో.

చటుక్కున జేబులో నుంచి చిన్న కత్తి తీసి శంభు "ఆ పని ఈ కథ వెయ్యకపోతే నేనే చేస్తా" అన్నాడు. రావ్‌కి గుండె ఆగినంత పనయింది. "కొంపతీసి దాంతో పొడుస్తారా ఏమిటీ?" అడిగాడు తడబడుతూ.

"చంపడమో చావడమో ఇవాళ తేలిపోవాలి"

అన్నాడు శంభు అదే కత్తితో మీసం దువ్వుకుంటూ.

"దయచేసి ముందు ఆ కత్తి లోపల పెట్టండి" అని "సరే! ఎలాగూ సమస్య కత్తులదాకా వచ్చింది కాబట్టి విషయం నా పరిధి దాటిపోయినట్లే. మిమ్మల్ని మా ఎడిటర్‌గారి దగ్గరకు తీసుకెళతా, ఆయన తేల్చాల్సిందే" అన్నాడు.

శంభుని వెంటబెట్టుకొని ఎడిటర్ ఛాంబర్‌లోకి వెళ్లాడు రావ్. "సార్! వీరు శంభుప్రసాదుగారు" అంటుండగానే "కూర్చోండి" అన్నాడు ఎడిటర్ మనోహర్. ఇద్దరూ కూర్చున్న తరువాత "చెప్పండి" అన్నాడు.

"సార్! నా కథ అన్యాయంగా తిప్పి పంపారు" అన్నాడు శంభు రావ్ వైపు కాస్త కోపంగా చూస్తూ.

ఎడిటర్ మనోహర్ పేపర్లు చేతిలోకి తీసుకొని మొదట ఆ కథ పేరు 'తెగిన తల' అని చూడగానే కాస్త కళ్లు తిరిగినట్లయింది. తన శరీరంలో మనసులో కూడా ఏమిటో రసాయన మార్పులు, పెదవులు కాస్త బిగబట్టవలసి వచ్చింది. తన మనోభావాలు ఎదుటి వారి ముందు కనబరచకుండా ఉండగలగటంలో ఆయన నేర్పరి.


ఆ కథ కొంచెం కొంచెం చదువుతున్నంతసేపూ అతని ముఖంలో ఎన్ని రంగులు మారాయో అన్ని రంగులూ శంభు ముఖంలోనూ మారుతున్నాయి. ఆయన కామెంట్ కోసం అన్ని ఇంద్రియాలను అటెన్షన్‌లో పెట్టి చూస్తున్నాడు.

ఎడిటర్ తన మనసులో "ఇతను చూడబోతే ఎవరోలాగా ఉన్నాడు, ఒక ఖూనీ చేసి మరొకటి చేసే గ్యాప్‌లో టైమ్‌పాస్‌కి ఇక్కడికి వచ్చినట్లున్నాడు. రచయిత లక్షణాలు ఏమాత్రం కనపడటం లేదు. ఈ కథ వెయ్యకపోతే దేనికైనా తెగించేట్లున్నాడు. వేస్తే మన పత్రిక పాఠకులు, రచయితలు బస్సుల్లో లారీల్లో ఆఫీసు మీదకి దాడికి రావడం ఖాయం. అప్పట్లో నాన్న ఎం.ఏ చేశావు కదరా ఏదైనా లెక్చరర్ ఉద్యోగం చూసుకో అంటే, సాహిత్యం అంటే నాకిష్టమని జర్నలిస్టునవుతానని చెప్పి కష్టపడి ఇంత కాలానికి ఈ ఎడిటర్ సీటులోకి రాగలిగా. కానీ ఈ రంగంలో కూడా పరిస్థితులు ఇంతగా విషమిస్తాయని ఊహించనే లేదు" అనుకుంటున్నాడు.

అదే సమయంలో శంభు అనుకుంటున్నాడు.

"ఇంతకీ సారుకి నా కథ నచ్చిందా లేదా? ఈసారైనా కథ పడకపోతే పరువు పోతుంది, ఏది ఏమైనా వది లేది లేదు" అని.

ఎడిటర్ రావ్ వైపు చూస్తూ "ఏమిటి మిస్టర్ రావ్?






ఏమయింది ఈ కథకి? ఎందుకు తిప్పి పంపారు? అదీ మూడుసార్లు?" అడిగాడు. రావ్ నెత్తిన పిడుగు పడ్డట్లయింది. శంభుకేమో ఆనందం ఎక్కువై వడదెబ్బ తగిలినంత వైబ్రేషన్. ఇంకా అంటున్నాడు ఎడిటర్ "ఈ కథలో ఎంత డెప్త్ ఉంది. ఎంత మెసేజ్. ఎంత మెలోడ్రామా ఉంది! ఇలాంటి కథలు వదులుకోవచ్చా? ఈ వారం పత్రికలోనే పడాలి" అన్నాడు. రావ్‌కి అంతా అయోమయంగా ఉంది. "ఏమిటి మిస్టర్ రావ్! మాట్లాడరేంటి?" మళ్లీ అడిగాడు ఎడిటర్.

"ఈ వారం పత్రిక ప్రింట్ అయిపోయింది కదా సార్" అన్నాడు కాస్త తేరుకొని.

"ప్రింట్ అయిపోతే వేరే పేపర్ మీద అయినా ప్రింట్ చేసి పత్రిక మధ్యలో అతికించండి. అంతేకానీ ఈ కథ వదలటానికి వీల్లేదు" అన్నాడు గంభీరంగా.

"సారీ సార్! పత్రిక పాకింగ్ కూడా అయిపోయి లోడ్స్ కూడా వెళ్లిపోయాయి" అన్నాడు నసుగుతున్నట్లుగా.

"అలానా!" అని పెద్దగా నిట్టూర్చి ఒక అర నిముషం శంభు వైపు చూస్తూ "ఈ కథ మీరే రాశారా?" అడిగాడు మనోహర్.

"నేనే సార్, నేనే రాసింది" దాదాపు గుండెలమీద బాదుకున్నంత పనిచేశాడు శంభు.

"నమ్మలేకుండా ఉన్నాను" అని ఎడిటర్ అనగానే "మీ ఉద్దేశ్యం" అడిగాడు శంభు. అతని కళ్లలో ఎర్ర జీరలు చదవగలిగిన మనోహర్ "అంటే నేను చెప్పదలుచుకున్నది ఏమిటంటే ఈ కథ మామూలు స్థాయిలో లేదు. రైలు పట్టాలు పీకడం, విమానాన్ని రాయితో కొట్టి పడగొట్టడం, హీరోయిన్ అయిదారుగురిని పెళ్లి చేసుకోవటం లాంటివి అసాధారణ ప్రయోగాలు. అసలు కథ పేరు చూడండి ఎంత విలక్షణంగా పెట్టారో! 'తెగిన తల' అని. తెగిన గాలిపటం అన్నంత సాధారణంగా అనిపించి ఉంటుంది మీ కవి హృదయానికి.

ఇంతటి కొత్తదనం ఉన్న కథని మా పత్రికలో వేసి మీ సమయం వృథా చేయటం ఎంతవరకు సమంజసం అని ఆలోచిస్తున్నా, అసలు మన తెలుగు సినిమా నిర్మాతలు కూడా ఇలాంటి సినిమా తీసే స్థాయికి ఎదగలేదని, ఒకవేళ తీసినా చూసి తట్టుకునే పరిపక్వత మన తెలుగు జనానికి ఇంకా రాలేదని నా భావన" అని శంభు వైపు పరిశీలనగా చూశాడు.

శంభు ఏదో ఆలోచనలో పడటం చూసి మనోహర్‌కి కాస్త ఊరట కలిగింది. పాచిక పారుతున్నది. సంభాషణ పొడుగించాడు "కాబట్టి మీరు బాలీవుడ్ కూడా కాదు, హాలీవుడ్‌కి ఈ కథ పంపితే బావుంటుందని నాకు అనిపిస్తున్నది. మన ప్రజలకు తగ్గట్లు మీరు ఏదైనా మామూలు కథ రాయడం జరిగితే మాత్రం మా వద్దకు తప్పక తీసుకురండి" అన్నాడు.

శంభు, రావ్ మనోహర్‌ల వైపు అదే పనిగా చూస్తున్నాడు, స్తబ్ధతగా రావ్, నేను చెప్పింది అక్షరాలా నిజం అనే అర్థం వచ్చేట్లు మనోహర్ చూస్తున్నాడు. వాతావరణం కాసేపు గంభీరంగా ఉంది. వాళ్లు చేయగలిగింది చేసి ఫలితం కోసం చూస్తున్నారు.

చిన్నగా పైకి లేచి శంభు "సరే సార్! మీరు చెప్పినట్లు ప్రయత్నం చేస్తా. మీరడిగిన కథతో మరొకసారి కలుస్తా" అని, చూశావా నీవు పసిగట్టలేని నా ప్రతిభ అన్నట్లు రావ్ వైపు ఒక చూపు చూసి, ఇద్దరికీ కరచాలనం చేసి ఠీవిగా బయటకు వెళ్లిపోయాడు.

"మొత్తానికి బలేగా మేనేజ్ చేశారు సార్! నా మటుకు నేను అందరితో కత్తి కంటే కలం గొప్పదని చెప్పుకొని తిరిగేవాణ్ని. ఇద్దరు మాత్రమే ఉన్నప్పుడు కత్తే గొప్పదని నాకు చెప్పక చెప్పాడు మహానుభావుడు" అన్నాడు రావ్.

"అవును మిస్టర్ రావ్! దాదాలు, గూండాలు రాజకీయాల్లోకి రావడం చూస్తున్నాము. ఈమధ్య సినిమాల్లో కూడా నటించడం చూస్తున్నాము, ఇప్పుడు సాహిత్య రంగంలోకి కూడా అడుగు పెట్టారు. ఏమైనా ఇక మన జాగ్రత్తలో మనం ఉండాలి. ఆఫీస్ మెయిన్ డోర్ దగ్గర ఒక మెటల్ డిటెక్టర్ ఏర్పాటుచేస్తే బాగుంటుందేమో" అన్నాడు ఎడిటర్ మనోహర్ మందహాసంతో.

## హిమేష్‌తో ఇలియానా!

టాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన ఇలియానా ఇక బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెడుతోంది. పాత సినిమాలను రీమేక్ చేసే సీజన్ ప్రస్తుతం జోరుగా నడుస్తోంది. అందులో భాగంగానే పాత 'కర్జ్' సినిమాని కూడా ఇప్పుడు కొత్తగా తీయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా ఇలియానాని ఎన్నుకున్నారు నిర్మాతలు. హీరోగా గాయక నటుడు హిమేష్ రేషమియా నటిస్తున్నాడు. హిందీలో ఇలియానా అదృష్టం ఎలా వుందో మరి!

